# బుద్ధం శరణం గచ్ఛామి

ఆనాడు "ఆసియా ఖండ జ్యోతి" బుద్ధుడి 2500వ జయంతి. మన దేశం లోనూ ప్రపంచంలో అనేక ప్రాంతాల్లోనూ సభలూ, సమావేశాలూ, కళా ప్రదర్శనలూ కోలాహలంగా జరుపుతున్నారు.

పట్నంలోనూ మ్యూజియం థియేటర్లో ఏర్పాటైన మహాసభలో మన ముఖ్యమంత్రిగారు ప్రత్యేకంగా ప్రసంగిస్తారు. అక్కడే ఒక హాల్లో భారీ ఎత్తున చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. యిద్దరు ప్రముఖ ప్రాంతీయ చిత్రకారులు బుద్ధుడి జీవితంలోని ప్రముఖ ఘట్టాలను అద్భుత శిల్ప నైపుణ్యంతో వేసిన వర్ణ చిత్రాలు ప్రదర్శితమౌతున్నాయి. యిందుకు ప్రభుత్వంవారు విరివిగా వ్యయం చేశారు కూడా. యీ ప్రదర్శన కూడా మన ముఖ్యమంత్రిగారే ఆవిష్కరించేందుకు అంగీకరించడం కూడా మరొక విశేషం.

2500 సం. నాటి ఆ బుద్ధుడు యీ నాటికీ యింకా ఆయన బోధనలతో మనమధ్య సజీవంగా వుండటం మన ఘనత కాక మరేమిటి? అలాగే యింకెందరో మహాపురుషులు మన దేశ శ్రేయస్సుకూ, మన బాగుకూ తమ జీవితాన్ని అర్పణ చేసి తమ ఆశయాన్ని (చరిత్ర పొడుగూతా) మన రక్త మాంసాల్లోకి యిమికించి మనల్నొ ఉత్తమ పౌరుల్నిగా మలచటమూ– అలా మనం మలుచుకోటం కూడా మన ఘనతకిందే జమ అవటమూ జరిగినై కూడా.

సాయంకాలం దగ్గర పడుతున్నకొద్దీ బుద్ధ జయంతి కోలాహలం పెచ్చు స్థాయి నందుకోటం స్ఫుటంగా తెలుస్తున్నది.

సా. 6 గంటలకు ముఖ్యమంత్రిగారి సభా ప్రసంగం, సా. 6-30 గంటలకు వారు చిత్రకళా ప్రదర్శనావిష్కరణ చేతురనే పత్రికల రాత.

అందుకు ఆయన వచ్చే దారి పొడుగుతా కొబ్బరాకుల చాందినీ గేట్లూ, పందిళ్ళు, రోడ్లకు నిలువుగానూ అడ్డంగానూ రెపరెపలాడుతున్న రంగురంగు కాగితాల తోరణాలూ, మంత్రిగారికి ఆహ్వానం తెలిపే బేనర్లూ, రోడ్లకు రెండు పక్కలా వున్న ఎలక్ట్రిక్ పోస్టులకు పైభాగానుండే లైట్లేగాక వాటికి మధ్య భాగాల్లోనూ ట్యూబు లైట్లు కట్టబడటమేగాక, పదిగజాలకో సరుగుడు పోస్టుకూడా అదనంగా పాతించబడి, వాటికీ ట్యూబులైట్లు కట్టబడి విషయం కాస్త ఘనమైంది గనుక సాయంకాలం 5 గంటలనుండే ఆ లైట్లన్ని కళ్ళు జిగేల్మంటూ వెలిగి, ఆ

రంగు రంగు తోరణాల రెపరెపల్తో ఆనాటి కార్యక్రమం ఓ ఫక్కీని అందుకుంది.

పట్నంలో ఒక పేటలోని ఒక కాలనీ తాలూకూ కొన్ని శాఖలకు సంబంధించిన ఓ పదిమంది వ్యక్తులు కొంత మొహపరిచయాలుండీ — లేక, తలో పద్ధతిలో తాహతులవారీగా సకాలంలో మ్యూజియం చేరి, కార్యక్రమాలకు యింకా వ్యవధి వుంటంవల్ల అక్కడి పచ్చికబయల్లో ఓ కూటమిగా - దశగ్రహ — చేరి కూర్చున్నారు.

ఈ దశగ్రహ కూటమిగా కూడిన వ్యక్తులు వరసక్రమంలో ఒకరు డాక్టరూ, యింకొకరు కెమిస్టూ, మరొకరు లెదర్ టెక్నాలజిస్టూ, ఒక ఇంజనీరూ, యిద్దరు కేవలం మేధావులూ, ఒక రిటైర్డు మాస్టరూ, ఒక రచయితా యిద్దరు విద్యార్థులూ అయి వున్నారు. ఈ కూటమికి కొంచెం సమీపంలో యిద్దరు మధ్య వయసు వ్యక్తులు తెల్ల జుబ్బాలూ, తెల్ల పైజామాల్తో కోరా రంగు సిల్కు వుత్తరీయాలు వల్లెవాటుగా వేసుకుని కూచున్నారు. యింకా అక్కడక్కడ గుంపులుగా యీ జయంతి ఆసక్తిపరులు చాలామంది వుండీ, అందరూ ఒకేసారిగా మాట్లాడుకుంటున్నారు గజిబిజిగా...

గడియారాలు షుమారు 6-45 గంటలు సూచిస్తుండగా మనసులు కుతకుతమంటూ వుడుకుతున్న ఆ చదువూ సంస్కారాలుండి అక్కడకు ఆసక్తితో చేరిన ఆ సమాజికులకు వార్త చేరింది. ముఖ్య రాష్ట్ర వ్యవహారాలపై ఢిల్లీ పట్నం వెళ్ళిన మన ముఖ్యమంత్రిగారు విమానం మిస్టికులవల్ల ఆలస్యమై యికమీద పట్నం ఎప్పుడు వచ్చి చేరినా చేరవచ్చని ఆ వార్త.

"బేష్! ముచ్చటగానూ వేడుకగానూ వుంది యివాల్టి వ్యవహారం!" అన్నాడు దశగ్రహ కూటమిలో ఒక గ్రహమైన- రిటైర్డు మాస్టారు.

"తమరు సెలవిస్తున్న అంతర్యం?" అడిగాడు యింకో గ్రహం ఓ విద్యార్థి.

"ఈనాడు మహా విశేషం అంటున్న ఆ బుద్ధ జయంతా మరి! తత్ కారణార్థమై యిక్కడీవిధంగా చేరిన వందల పెద్దమనుషు ల్నిరకంగా యీ బయల్లో మెలికలు తిరిగిపోతూ పడేసి వుంచటంవల్ల, మన ముఖ్యమంత్రిగారి పరువేవిధంగా దక్కుతుందో నా కర్థం కావటంలేదు" అని విచారం వెలిబుచ్చాడు రిటైర్డు.

"మరా విమానానికి రిపేరేదో వచ్చిందంటున్నారే?" అన్నాడు.

"బొంపాయి రిపేర్లు. యిది మన ముఖ్యమంత్రిగారి విషయం అనుకు

న్నారా. గొర్రెపోతు లోకనుకున్నారా? మంత్రుల వ్యవహారాలంటే ఒక విమానం కాదు రాకెట్లను తలదన్నే డజను విమానాలు హాజరవుతై. అలా వారు మీట నొక్కారంటే—మరాపని వారు చేయరే!" అన్నాడు రిటైర్డు, నిరుత్సాహంగా.

"చిక్కులిమీ పక్కి కైవడిన్!" అన్నాడు విద్యార్థి.

"చాలేవోయ్ మీ సరసం అసలే అరికాలిమంట నెత్తికెక్కి మతోతుం చేసూ!" చిరాగ్గా అన్నాడు, ఇంజనీరు.

"అసలు మేకలకం పట్టి తిన్నది నేనూ నా బుద్ధీనూ. యీ బుద్ధ జయంతికి చచ్చినట్టు సెలవిచ్చి తీర్తాను. ఓ పిక్నిక్కు వెళ్ళి పార్టీ చేసుకుందాంరా టెంపీ అనా వెంకటావు చెవులో కోడై కూసి కూసి నా గుండెలు పడిపోయినా విన్నాడా వాడూ? యివాళిక్కడ మహా మజాగా వుంటుంది. రకరకాల రంగుల క్లాసు బొమ్మలొస్తయ్. సరదాగా- అని నన్నిక్కడ కలుస్తానన్నవాడు, ఏడీ ఎక్కడా?" కుముల్తూ అన్నాడు కెమిస్టు.

"ఇందుగల డందులేడని సందేహము వలదు. ఎందెందు వెదికి జూచిన అందందే కలడు. వాడు కలడో లేడో?" కవనం పలికాడు విద్యార్థి.

"ఎవరివోయి నువ్వూ— ఏ కాలేజీ?" ఝాడించడిగాడు, కెమిస్టు.

"మావాడు యితర కాలేజీ ప్రొఫెసర్లతో సరదాగా మాట్లాట్టానికి ముచ్చట పడ్డాడండీ!" అన్నాడు రెండో విద్యార్థి.

"అడుక్కు తిన్నట్టుంది. మీ ముచ్చట్లు మీరూ! ఆటే చూస్తే మన కిక్కడ సరిపడినంత కాలక్షేపం వుండేట్టుందే!" అన్నాడు కెమిస్టు, విద్యార్థుల వాలకం గమనించి.

"తర్కము కూడదు!" అన్నాడు విద్యార్థి.

సోడాల వాళ్ళొచ్చి దశగ్రహ కూటమి సభ్యులచేత తలోసోడా తాగించి వెళ్ళారు

"అసలీ బుద్ధుడెవరో?" అన్నాడు ఇంజనీరు, తన ఆలోచన అందరికీ వినపడేట్టుగా.

"ఒక వేదాంతి" అన్నాడు లెదరు.

"ఆ విషయం అందరికీ తెలుసు. నా వుద్దేశ్యం బుద్ధుడు ఏ ప్రాంతాల వాడని?" అన్నాడు ఇంజనీరు.

"గుంటూరువద్ద అమరావతి వాస్తవ్యుడనుకుంటా" అన్నాడు లెదరు.

"ఏమిటి దాఖలా?" అడిగాడు ఓ మేధావి.

"ఇవాళ దాఖలా అని చరిత్రకారులంటున్నది రేపు వాళ్ళే ఆ దాఖలా నిజం కాదంటారే?" అన్నాడు రెండో మేధావి.

"లెదరుగారు చెప్పింది నిజం అయేందుకు చాలా దాఖలాలున్నాయ్. మన ఆంధ్రదేశంలో బౌద్ధమతం వ్యాప్తి అయినంతగా యింకే ప్రాంతంలోనూ వ్యాప్తి కాలేదనేందుకు దాఖలాగా ఆంధ్రలో ఎక్కడపడ్తే అక్కడ బౌద్ధ స్తూపాలూ బౌద్ధ శిల్పాలు బయటపడ్డయ్యంటారు. దీని అర్థం బుద్ధుడిక్కడివాడు కాక మరింకెక్కడివాడూ కాడు గనకనేనని అనుకోవచ్చు. పైగా అమరావతిలో చాలా పెద్ద స్తూపం వుండేదట. స్తూపం అంటే గోరీ అని చెప్పనే అక్కర్లేదు. యింకా యితరచోట్లవున్న స్తూపాలు చిన్నవి గనక అమరావతి స్తూపం బుద్ధుడి గోరి అయివుండాలి." అన్నాడు డాక్టరు.

"బుద్ధుడు అక్కడ మరణించక పోతే ఆయన స్తూపం అమరావతిలో వుండదు." అన్నాడు లెదరు.

"సామాన్యంగా జన్మస్థలాల్లోనే వారు మరణించిన గోరీలుంటయ్ గనుక బుద్ధుడు మన అమరావతీ వాస్తవ్యుడవటం చచ్చినట్టు ముమ్మాటికీ నిజం కావచ్చు. అందులో పెద్ద స్తూపం బుద్ధుడంత వాడికే కేటాయిస్తారు" అన్నాడు డాక్టరు.

"పెద్ద చచ్చుకు పెద్దస్తూపం, చిన్న చచ్చులకు చిన్న స్తూపాలా!" అన్నాడు విద్యార్థి.

"మరి, నాగార్జున కొండవద్ద యింకో పెద్దస్తూపం అమరావతంతదే వుందే, దాని విషయం ఏమంటారూ?" అడిగాడు కెమిస్టు.

"అది కొంచెం లేటుగా కట్టింపై వుండవచ్చు. పైగా బుద్ధుడక్కడ కొన్నాళ్ళు తన ప్రచారం ఎందుకు చేసివుండకూడదు? అందువల్ల అక్కడా ఆయన జ్ఞాపకార్థం అంత పెద్ద స్తూపం లేచివుండవచ్చు". అన్నాడు ఇంజనీరు.

"అదీ ఒక పాయింటే!" అన్నాడు విద్యార్థి.

"సమస్య ఒకదారి కొస్తున్నదని నా అభిప్రాయం. బుద్ధుడు అమరావతి లోనే పుట్టి తన మృత్యుదశలో నాగార్జున కొండవద్ద వుంటం సంభవించినందు వల్లకూడా యీ రెండు స్తూపాలీరకంగా మనల్ని తికమక పెడ్తుండవచ్చు," అన్నాడో మేధావి.

"అన్నట్టు యింకో పెద్ద తికమకపెట్టే వ్యవహారం కూడా పన్లో పని పరిష్కారం కావాల్సి వుండిపోయిందని నా మనవి. బుద్ధగయలో చాలాపెద్ద బౌద్ధ దేవాలయం ఒకటుంది. అంత పెద్ద బౌద్ధ దేవాలయం మన భారతదేశంలో

మరెక్కడా యింకోటి కనిపించదంటారు. మన పూర్వీక బౌద్ధులకు మహా పురుషుల జన్మస్థలాల్లో దేవాలయాలు కట్టుకుని పూజలు చేసుకునే ఆచారం ఒకటుందట! బుద్ధుని జన్మస్థానం అక్కడెందుక్కాకూడదూ?" అడిగాడు రెండో మేధావి.

"చారిత్రాకాధారాలు బలపడుచుండవచ్చు!" అన్నాడు విద్యార్థి.

"మన ఆంధ్రుడనుకున్న బుద్ధుడు వుత్తరాదికి వెళ్ళిపోతున్నాడేం కర్మండీ?" విచారించాడు ఇంజనీరు.

"చరిత్రలెప్పుడూ క్లిష్టంగానూ కష్టనష్ట భూయిష్టంగానూ వుండును! మన మందులోని వుపయోగమైనదాన్నే విడదీసి తీసుకొనుట ఉత్తమ లక్షణం!" అన్నాడు రిటైర్డు.

"మీ అందరి అనుభవాలూ అభిప్రాయ సారాంశాలూ సమన్వయిస్తే నాకొక పరిష్కార మార్గం తడుతున్నది. బుద్ధుడు గయలో పుట్టి, అమరావతిలో బాల్య, కౌమార, యౌవన దశలు గడిపి, వృద్ధాప్యంలో నాగార్జున కొండకు చేరి గతించి వుండవచ్చు" అన్నాడు డాక్టరు.

"చరిత్ర అంచలంచలుగా శిఖరాగ్ర స్థాయిలో అంత్యదశకు చేరినట్టు స్పష్టమగుచున్నది." అన్నాడు విద్యార్థి.

"అసలు మనవాళ్ళకు మన చరిత్రల్ని పదిలపర్చుకునే అలవాటెక్కడు న్నాయ్ చెప్పండి?" అన్నాడు కెమిస్టు.

"ఆ ఘనతంతా ఆ ఇంగ్లీషు వారితోనే వెళ్ళిపోయింది! చూడండీ, అసలీ బౌద్ధమతం చచ్చి కొన్ని శతాబ్దాలైనా ఆ మత ప్రచారకుడైన ఆ బుద్ధ ప్రబుద్ధుణ్ణి మనవాళ్ళు మళ్ళీ యివాళ బైటికి తోడవలసిన కర్మేం పట్టిందో మీలో ఏ ఒక్కరి కైనా బోధపడిందా?" పృచ్ఛ చేశాడు, రిటైర్డు

"ఇదీ ఒక పాయింటే!" విస్తుపోయ్యాడు విద్యార్థి.

"బుద్ధుడు బౌద్ధమతాన్ని ప్రచారం చేశాడనే జ్ఞానం తమకెక్కడ లభ్య మయిందీ?" అడిగాడు రచయిత, మౌనంనుండి బాహ్యానికొస్తూ.

"చంపేశారు! తమరు రచయితలు కామా? తమ అభిమతం ఆయన బౌద్ధమత ప్రచారకుడు కాదనా?" అడిగాడు రిటైర్డు.

"అనే అంటున్నా" అన్నాడు రచయిత.

"చిత్రం! అసలీ రచయితగారు రాముడికి సీతేం కాదనే పద్ధావతిలో తర్కాన్ని వుటంకిస్తున్నట్టున్నారు? అయ్యా రచయితగారూ, యీ బౌద్ధ

మతాన్ని సృష్టించిందీ ప్రచారం చేసిందీ ఆ బుద్ధుడుకాక మరెవరైందీ సెలవిస్తే విని ఆనందించగలనని మనవి!" అన్నాడు రిటైర్డు.

"అలా సృష్టించిందీ ప్రచారం చేసిందీ మీరూ నేనూ, మనలాంటి వాళ్ళూనూ." అన్నాడు రచయిత.

"చోద్యంగా వుంది!" ముక్కుమీద వేలేసుకున్నాడు రిటైర్డు.

"తమాషగా వుంది!" వింత ధ్వనులొచ్చినై, కొన్ని గ్రహాలనుండి.

"బుద్ధుడు, బౌద్ధమతమంటూ ఏ మతాన్నీ ప్రచారం చేయలేదు. ధర్మ పథాన మానవులు తమ జీవితాల్ని తరింప చేసుకునేందుకు పంచశీలాన్ని అల వర్చుకోవాలని ప్రతిపాదించాడు. అలాగే ఏసుక్రీస్తు కిరస్తానీ మతాన్నంటూ ప్రచారం చేయలేదు. జీవకారుణ్యతా, పరస్పర ప్రేమా కావాలంటం తప్ప. అలాగే జైనాచార్యుడు, మహావీరుడూ, శంకరాచార్యుడూనూ— చివరకు మహావిష్ణు కూడా వైష్ణవాన్ని ప్రచారం చేయలేదు." అన్నాడు రచయిత.

"మరి బుద్ధుడు మన ఆంధ్రుడు కొంత అవునూ మరి కొంతకాదా అండీ?" అన్నాడు విద్యార్థి.

"కొంపదీసి చరిత్ర నదుపు చేయటంకూడా యీ రచయితగారికే వొదిలేస్తు న్నారా ఏమిటి కర్మ?" అనేశాడు రిటైర్డు.

"మీ కర్మేమిటి? మిమ్మల్నంటుకుని నా కర్మకాలింది, మరి మన బుద్ధి గాడిదలు కాస్తే అభిప్రాయాలా గాడిదలెక్కి స్వారీ చేస్తయిట! బుద్ధుడు నేపాల దేశ సరిహద్దులవాడు. అక్కడ లుంబినీవనం అనేచోట జన్మించాడుగాని మన ఆంధ్రదేశంలోని అమరావతిలో మన వేలువిడిచిన మేనమామకు పుట్టలేదు, దురదృష్టంకొద్దీ. అలాగే బీహారు రాష్ట్రం. గయలో ఒక రావిచెట్టుకింద బుద్ధుడికి జ్ఞానోదయం కలిగినందువల్ల అక్కడ బుద్ధగయ దేవాలయం నిర్మాణ మవటమూ అలాగే బుద్ధ నిర్వాణానంతరం ఆయన ధాతువులు అనేక దిక్కులకు పంపకమై నిక్షిప్తమైన ఆధాతువులమీద పూజార్థమై స్తూపాలు నిర్మాణమవటమూ జరిగినై," అన్నాడు రచయిత.

"నమ్మేట్టుగా లేదు" ముక్తసరిగా అన్నాడు రిటైర్డు.

"నేను చెప్పిన యథార్థాన్ని నిజంగా మీరు నమ్మితే నన్ను నేను కొరత వేసుకుంటాను!" అన్నాడు రచయిత.

"దారుణం!" అన్నాడు రిటైర్డు.

"కనీవినీ ఎరగనీ భరింపరానీ భయంకర దారుణం అని అనాలి. అంటున్న

విద్యార్థి పీకపిసికినట్టయి, నోరు టప్పున మూతపడింది.

కోలాహలం- అరుపులు- కేకలు - పెడబొబ్బలు తోసుకుంటున్నారు- గిచ్చుకుంటున్నారు. జుట్లు పీక్కుంటున్నారు- పమిటలు లాగుతున్నారు. పళ్ళూడుతున్నయ్. పోలీసులు- అమ్మ పోలీసులు- కార్లొస్తున్నయ్, హారన్లు నొక్కుతున్నారు. హెడ్ లైట్సు- వచ్చారు. వారొచ్చారు. ముఖ్యమంత్రిగారొచ్చేశారు- తప్పుకోండి. దారి- అని గొంతులు చిరిగి పీలికలై సహస్ర స్వరాల్తో అవరణ మారుమోగింది.

ముఖ్యమంత్రిగారు సభ ప్రారంభించారు.

"నమస్కారం. ఆలస్యమయింది మరి. మీకు కోపం వచ్చుంటుందికూడా. ఆ దోషం నేనొచ్చిన విమానం తాలూకూ యంత్రాలదంటాను. పాపం ఆ విమాన చోదకులు కంగారుపడ్డారు. చివరికి పాపం కిందామీదా పడి సురక్షితంగా నన్నిక్కడికి చేర్చారు.

"మా నాయనా మీ నాయనా వాళ్ళ తాతముత్తాతలూ ఒంటెద్దు బండెక్కారు. రెండెడ్ల బండెక్కారు. ఆ ఒళ్ళమీదే వారు దేశమంతా తిరిగారు. వారికి లోపం ఎక్కడా కలగలేదు. వారు ధన్యులు. వారి జీవితాలు సాఫుగా వెళ్ళిపోయినై. రైలుబళ్ళొచ్చినై, బస్సులొచ్చినై, సొంత కార్లొచ్చినై. అప్పటికీ వేగం చాలక విమానాలు దింపుకున్నాం. మరి ఏమయింది? వాటి యంత్రాలు చెడుతున్నయ్! మరి వేగం అనే మాటకు అర్థం ఏమయింది? వ్యర్థమయింది. చూశారా?

"అందుకు మీ మనస్సుకు గాయాలు తగిలి బాధననుభవించారు. ఎందుకింత బాధలనుభవించారు? అయినా మీరెందుకింత ఓర్పు, సహనంతో కూచున్నారు? ఏ మహత్తర అగోచర శక్తి మిమ్మల్నావహించి యీ రకంగా కూచోపెట్టిందో ఏ ఒక్కరైనా వూహచేసి వుండిరా? వుండివుండరు!

"ఆ మహత్తర లోకోత్తర శక్తే ఆ బుద్ధభగవానుడు! ఆ బుద్ధ దేవుడే మిమ్మల్నిక్కడికి రప్పించాడు. మీరొచ్చి కూచున్నారు, నేనూ మీరూ కేవలం నిమిత్త మాత్రులం అంటాను. (ఆ భగవానుడు చెప్పిన నాలుగు మంచి ముక్కలు మా చెవిన వేయండి అనంటున్న ఆ వ్యక్తి పీకనెవరో పిసికారు) ఆ బుద్ధ దేవుణ్ణి గురించిన పరిశోధనలు యిప్పటికి నా తల వెంట్రుకలన్ని జరిగినై. ఇట్టి పరిస్థితుల్లో ఆయన్ని గురించి ఎవరేమి చెప్పదల్చుకున్నా అజ్ఞానంగానూ, సాహసంగానూ వుంటుంది. మన ప్రభుత్వం ఆ బుద్ధ భగవానుడి పంచశీలను మన

రాజ్యాంగంలో పొందుపరిచే వుంచింది. అందువల్ల ఆ బుద్ధ దేవుడికి నేనూ మీరూ ప్రస్తుతం మనసారా 'బుద్ధం శరణం గచ్ఛామి' అని ప్రార్థిద్దాం. జై హింద్."

ఫోటో బల్బులు తళుక్‌మన్నయ్ కరతాళ ధ్వనులు మారుమోగినై. ముఖ్య మంత్రిగారు చిరునవ్వుల్తో వేదిక దిగారు.

"అంతేనా?" అన్నారెవరో.

"యింకెంతోయ్?" యింకోరన్నారు.

"ముఖ్యమంత్రిగారు కదా– కాస్తేమన్నా లోతుగా విషయాలుంటయ్యేమో ననుకుంటే- తుస్సుమందే?" మరొకరన్నారు.

"నోరు మూయవోయ్" చప్పునన్నారెవరో.

పత్రికా విలేఖర్లు నోట్సు రాసుకుంటుండగా, ఫోటో బల్బులు తళుక్ తళుక్ మంటూంటే, ముఖ్యమంత్రిగారు కళా ప్రదర్శనావిష్కరణ చేసి, ప్రద ర్శన వీక్షించేందుకు ముందుకు సాగారు. వారిననుసరించి మంత్రివర్గం తాలూకూ ఓ నలుగురూ, వారితోటే మ్యూజియం క్యూరేటరూ, కొంచెం దగ్గర్లో నలుగురు పోలీసధికార్లూ, కొంచెం అవతల దళగ్రహ కూటమి బృందం, వారి వెనుక శ్వేత వస్త్రాలూ, కోరా ఖద్దరు సిల్కు వుత్తరీయాల్తో వున్న ఆ యిద్దరు మధ్య వయ స్కులూ వున్నారు

"ఇదేమిటి?" ముఖ్యమంత్రిగారు ఒక చిత్రంవద్ద ఆగి ప్రశ్నించారు.

" 'కల' అనే చిత్రం. బుద్ధుణ్ణి కనేముందు తల్లి మాయాదేవి ఒక తెల్ల ఏనుగు తన గర్భంలోకి ప్రవేశిస్తున్నట్లు కలగంటుంది" క్యూరేటరు వివరించాడు.

"మీకు సరీగా తెలుసా?" ప్రశ్నించారు ముఖ్యమంత్రి.

"మరి చరిత్ర అలా చెబుతున్నది" అన్నాడు క్యూరేటరు, తెల్ల మొహం వేసి.

"చరిత్రలు మార్తుంటయ్. మీరు గమనిస్తుంటారో లేదో !" అన్నారు ముఖ్యమంత్రి.

"చిత్తం. నేనీమధ్య చరిత్రల్లో జరిగిన మార్పులు గమనించటం జరిగింది గాని, ఒకటో అరో నా దృష్టినుంచి తప్పుకుపోయి వుండవచ్చు" కంగారుపడ్తూ అన్నాడు క్యూరేటరు.

"కాస్త సరీగా గమనిస్తుండండి. యిక్కడ యిదేమి?" యింకో చిత్రం వేపు మెడ సంజ్ఞతో ప్రశ్నించారు ముఖ్యమంత్రి, ముందుకు కదుల్తూ.

"లుంబిని వనంలో మాయాదేవి బుద్ధుణ్ణి ప్రసవిస్తున్న దృశ్యం" అన్నాడు

క్యూరేటరు.

"అనుకున్నా. కాని చిత్రంలో లోపాలున్నాయ్. మన చిత్రకారులు పాత పద్ధతులు మానుకోవాలి. యిదేం చిత్రం? కొంత బాగున్నట్టుందే?" అడిగాడు ముఖ్యమంత్రి ముందుకు కదుల్తూ.

"మహాభినిష్క్రమణ" చెప్పాడు క్యూరేటరు.

"నాకు తెలుసయ్యా మహానుభావా! నేనంటం, నలుగురకూ అర్థమయ్యేట్టు తెలుగులో చిత్రం పేరుపెట్టొచ్చుగా అని. ఆ పిల్లకాయల్తో చెప్పండి. మరి మేం సెలవు తీసుకుంటాం" అంటూ చప్పట్లు, తాళాలూ ఫోటో తళుకుల మధ్య నమస్కారాల్తో ముఖ్యమంత్రిగారు నిష్క్రమించారు.

"బుద్ధం శరణం గచ్ఛామి" మూలిగినట్టన్నారెవరో.

"ఏమోననుకున్నా మన ముఖ్యమంత్రిగారు బావవున్నవాడే!" సంతృప్తి వ్యక్తం చేశాడు రిటైర్డు. ప్రదర్శనలోంచి బయటపడ్తూనే.

"మహానుభావా, తమరు ధన్యజీవులు! మమ్మూ పతాక సన్నివేశానికి చేర్చి పుణ్యం కట్టుకున్నారు! కాలం కలిసిరాక తమరు మా వెంట పడ్డారుగాని, తమరు కేవలం ముఖ్యమంత్రిగారి భృత్యవర్గంలో వుండవలసిన వారు!" అన్నాడో రచయిత.

"పాహిమాం, పాహి పాహి" అన్నాడో విద్యార్థి

"అయ్యా, రిటైర్డుగార్ని సొంతం మాట్లాడనీయటం కనీస ధర్మం." అన్నారెవరో.

"మన ముఖ్యమంత్రిగారికి యీ కళాప్రదర్శన నూరుపాళ్ళా నిరుత్సాహ పరిచినట్లు నా బుద్ధికి తట్టటం అలావుంచుతే, యిక ప్రదర్శన చూస్తూందే నాకు కలిగిన అభిప్రాయం తెలుపనీయండి. పాపం, ఆ పిల్లకాయలెవరో ఆ చిత్రాలవుతే వేశారుగాని, అవి కాస్తన్నా తెలిసేట్టుగా లేక అయోమయంగా వుండి, పాపం ఆ పిల్లకాయలకు అనుభవం తక్కువేమోననే భావన కలిగి–" రిటైర్డు అంటూ పోతుంటే–

"మీ భావనలూ మా భావనలూ ఏకీభవించగలవని నా భావం." అన్నాడు డాక్టరు, రిటైర్డు దీర్ఘాలు తియ్యనీయకుండా.

"మీ భావాలు దౌర్భాగ్యంగా వున్నాయ్. మీరుచూసి తెలుసుకునే ప్రదర్శనలు వేరు. మీరు తప్పుచోటికివచ్చి రచయిత పాపం, మీ అమూల్యమైన కాలాన్ని వ్యర్థం చేసుకున్నారు" అన్నాడు.

"ఏ ప్రదర్శనైనా అందరూ చూసేందుకా యింకోందుకా? మమ్మల్ని మీరు ఇన్సల్టు చేసే మీ అర్హతేమిటి? అడిగారు మేధావులు.

"మన మేధావుల వారు ప్రశ్నించినది వినముచ్చటగా వుంది. వారు సెల విచ్చినట్లు అట్టి ప్రదర్శన మేమందరమూ తిలకించవచ్చానే ధర్మము ఒక పాల వుతే తదనంతరము ప్రదర్శనపై మన అభిప్రాయాలు యధేచ్ఛగా తెలుప వచ్చనే ధర్మం రెండు పాళ్ళుందవచ్చని విజ్ఞులు సెలవిచ్చివున్నారు." విడమర్చి తెలిపాడు రిటైర్డు.

"మహాశయా, అన్ని పాళ్ళతో దట్టించిన తమధర్మం తుక్కురకందని తెలుపవలసి వచ్చి విచారిస్తున్నాను. ముఖ్య విషయం ఆ చిత్రాల్లోవున్న ఏ విషయమూ మీకు తెలియదు. తెలుసుకునే ఆసక్తి అంతకన్న వున్నట్టులేదు. గనుక ఆ చిత్రాలపైన, ఆ చిత్రకారులపైనా బురదచల్లే అర్హతా మీకంతకన్నా లేదు. పైగా మీకు బుద్ధుడెవరో ఎక్కడివాడో తెలియదు. మన అమరావతి, నాగార్జునకొండ గురించి బౌద్ధయుగాల్లో వాటి ప్రాశస్త్యమేమిటో అసలే తెలియదు. మీకు స్థూపాల అర్థం తెలియదు. బుద్ధుడి జ్ఞానోదయం గురించిన పుదంతమూ తెలియదు. బౌద్ధ కళల్ను గురించిన మీ జ్ఞానం అధమరకపు అజ్ఞానం!" అన్నాడు రచయిత.

"దారుణం! రౌడీ ముఠా నాయకుడు!" చిన్న కేకపెట్టాడు రిటైర్డు.

"కుట్ర!" అరిచారెవరో.

"కమ్యూనిస్టయి వుంటాడు. రాజకీయ కుట్ర!" అరిచారం కోరు.

"వుండవయ్యా. కిందటి ఎన్నికల్లో మనవాళ్ళు కమ్యూనిస్టుల్తో కొన్ని చోట్ల పొత్తు కలిపారు" మరొకరన్నారు.

"అయితే? సాదాకుట్రే!" యింకోరన్నారు.

"పట్టుకోండి."

"నలగ పొడవండి."

అరుపులు— గావుకేకలు. పోలీసులు పరుగెత్తండి. పారిపొండి.

నాలుగు మూలలకూ పరుగెత్తారు జనం, ప్రహరీగోడలపైగా ఎగుర్తూ.

క్షణాల్లో మ్యూజియం మైదానం నిర్మానుష్యమైంది. ఒకమూలగా దట్టంగా వున్న క్రోటన్ల దుబ్బుల వెనకతప్ప.

"ఎవరు మీరు?" అడిగాడు ఆ దట్టంగావున్న మొక్కల వెనక పడున్న రచయిత, తనను మెల్లిగా ఎత్తుతున్న ఆ శ్వేతవస్త్రాలూ వుత్తరీయాలూ కప్పుకున్న ఆ యిద్దరు వ్యక్తుల్ని అనుమానంగా చూస్తూ.

"మేమిద్దరం ఆ కళా ప్రదర్శన చిత్రాలు వేసి చిత్రకారులం. మీకు దెబ్బలు బాగా తగిల్నయ్యా? మీరిటు పరుగెత్తటం చూశాంగాని ఆ ముఠా స్థాయికి దిగలేని నిస్సహాయులం. క్షమించండి." అన్నారు చిత్రకారులు

"ఒళ్ళు హూనం అయింది. అంతే– తలపగిల్న లక్షణాలేం లేవు. నయం! ఒక్కోసారి చెప్పకూడని నిజాన్ని చెప్పటంవల్ల నిజం నిజంగా కుట్ర కింద మాట్టం– మీకిదే ప్రథమానుభవం అనుకుంటా. మా కళా ప్రదర్శనా– ప్రత్యేకించి కొన్ని చిత్రాలూ నా హృదయాన్ని పెనవేసుకున్నాయ్. అందుకు మనసారా మిమ్మల్ని అభినందించనీయండి. పరవాలేదు. ఒళ్ళు కొంచెం స్వాధీనంలో కొస్తున్నది, నిజానికి బుద్ధుడి జీవితం గురించి తెలుసుకుంటానికి ఎవరేకొంత ఆసక్తి చూపినా మీ కళాప్రదర్శన అర్థం కానంతగా వుండదనుకుంటా?" అన్నాడు రచయిత, మెల్లిగా లేచి కూచుంటూ.

"మీరు చెప్పిందాంటో నిజం చాలావుంది. కాని కళ మన సమీపానికి రాగలిగేది కొంత పరిశీలనా సాధనా వుంటేనే సాధ్యమవుతుంది. మీరు మనసు విప్పి మా చిత్రాల్ని గురించి తెలిపిన అభిప్రాయాలు మా హృదయాల్ని ఆనందంతో నింపినై! యివాల్టి మీ చర్య కళను మైలపడనీయలేదని చెప్పగలం! అందువల్లే ఒక్క విషయం మిమ్మల్ని దాపరికం లేకుండా అడగాలనుకుంటున్నాం. యీ కళాప్రదర్శనకు మా యిద్దర్నీ నియోగించారు. మేమీ చిత్రాల్ని కష్టపడి వేశాం. కాని మేమక్కడ వున్నట్టెవరూ—"

★